



ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం


# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd





వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు


Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 73 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 06 రూ - 03/- మంగళవారం 12 మార్చి 2024




## భద్రాద్రి వేదికగా ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

- పథకాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్
- డబుల్ ఇళ్ల పేరుతో పేదలకు కెసిఆర్ మోసం
- డబుల్ ఇళ్లున్న ఊరుచూపితే ఓట్లు అడగబోం
- కెసిఆర్‌కు సిఎం రేవంత్ సవాల్
- ఎన్ని ఇళ్లు కట్టించారో చూపాలని బిజెపికి కూడా సవాల్
- వరదనీటి కరకట్ట నిర్మించేందుకు 500కోట్లు మంజూరు

**భద్రాద్రి కొత్తగూడెం,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆశీస్సులతో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం ఎంతో సంతోషంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భగవంతుడి సన్నిధిలో ఈ కార్యక్రమం ప్రారంభించడంఆనందంగా ఉందన్నారు. అన్నింటికి మించి కాంగ్రెస్‌ను ఆదరిస్తున్న ఖమ్మం జిల్లా నుంచి కార్యక్రమం చేపట్టడం మరింతి ద్విగుణీకృతంగా ఉందన్నారు. సోమవారం భద్రాద్రిలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల నాడు ఇందిరమ్మ పాలనలో ఉంటే నేడు ప్రజా పాలనలో మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల పథకం అని అన్నారు. ఇల్లాలి ముఖంలో సంతోషం ఉండేలా పేద వాళ్ళు ఆత్మ గౌరవంతో బతికేలా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇంటి పట్టా ఆడబిడ్డ పేరు మీద ఇస్తామన్నారు. డబ్బా ఇళ్ళు వద్దు పండగ పూట బిడ్డ అల్లుడు వస్తే ఎక్కడ ఉంటారు అంటూ పేదల కలల మీద కేసీఆర్ రాజకీయ వ్యాపారం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ మోసానికి కాలం చెల్లిందని తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను బొంద పెట్టారన్నారు. ఇలా పదేళ్లు ప్రజలను మోసం చేశారని అన్నారు. బడుగు వర్గాల ఆత్మ గౌరవమే ఇందిరమ్మ ఇళ్లని.. పేదల కష్టాలు చూసి ఆనాడు ఇందిరాగాంధీ ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భద్రాచలం స్వామి వారి ఆశీర్వాదం తీసుకుని పథకం ప్రారంభించానని.. ఇల్లాలి ముఖంలో సంతోషం ఉంటే ఆ ఇల్లు బాగున్నట్లేనని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు మహిళల పేరుతోనే ఉంటాయని స్పష్టం చేశారు. అంతకు ముందు సీఎం రేవంత్ భద్రాచలం సీతారాముని ఆలయానికి వెళ్లారు. ఆలయ ఈవో, వేద పండితులు పూర్ణ కుంభంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. సీఎం వెంట మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క ఉన్నారు. పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే ఈ పథకం లక్ష్యమని చెప్పారు. రూ.22,500 కోట్లతో 4,50,000 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నాంమని.. పదేళ్లు చెప్పిన కథనే మళ్లీ మళ్లీ చెప్పి తెలంగాణ ప్రజలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మోసం చేశారని మండిపడ్డారు. అందుకే కేసీఆర్

వివరాలు 2లో



## దేశ సాంకేతిక విప్లవంలో మహిళలే కీలకం

- మరింత విస్తరించనున్న డ్రోన్ సాంకేతికత
- సశక్తి నారీ వికసిత్ భారత్ కార్యక్రమంలో మోడీ
- మరోమారు తమదే అధికారమని ధీమా

**న్యూఢిల్లీ,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత్‌లో సాంకేతిక విప్లవాన్ని మహిళలే ముందుండి నడిపిస్తారని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన దిల్లీలో జరిగిన సశక్తి నారీ వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. 21వ శతాబ్దంలో మహిళలు ఐటీ, స్పేస్, సైన్స్ రంగాల్లో ఎలా పేరు తెచ్చుకొంటున్నారో చూస్తున్నాం. ప్రపంచంలోనే కమర్షియల్ విమానాలను నడిపే మహిళా పైలట్ల సంఖ్య భారత్‌లోనే అత్యధికం. రానున్న రోజుల్లో దేశంలో డ్రోన్ సాంకేతికత మరింత విస్తరించనుంది. అసంఖ్యాక అవకాశాలు 'నమో డ్రోన్ దీదీ'లకు లభించనున్నాయి. గత పదేళ్లలో దేశంలోని స్వయం సహాయక బృందాల విస్తరణ అనేది ఓ పరిశోధించదగిన అంశం. అవి మహిళా సాధికారతలో చరిత్ర సృష్టించాయని

వివరాలు 2లో

## స్వామి సన్నిధిలోనే భట్టికి అవమానం

- సిఎం రేవంత్ క్షమాపణలు చెప్పాల్సిందే
- ఎమ్మెల్సీ కవిత డిమాండ్




**నల్లగొండ,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖను అవమానించారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఇది చాలా దౌర్భాగ్యమని.. సీఎం వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. నల్గొండ జిల్లా కేంద్రంలో ఆమె సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ లో పూలే విగ్రహం పెట్టాలని స్పీకర్‌కు వినతిపత్రం ఇస్తే ఆనాడు కూడా దళితుడుకి వినతిపత్రం ఇచ్చారని రేవంత్ అవమానించారని గుర్తు చేశారు. అప్పుడు ఓపికపట్టా మని.. ఇవాళ సాక్షాత్తు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా భట్టి విక్రమార్కను అవమానించారన్నారు. సీఎం వెంటనే భట్టి విక్రమార్క, కొండా సురేఖలకు క్షమాపణలు

వివరాలు 2లో

## వేడెక్కిన తెలంగాణ రాజకీయం

- నేడు మూడు పార్టీల ప్రచారహోరు
- కరీంనగర్‌లో కెసిఆర్ కదనభేరీ
- పరేడ్‌గ్రౌండ్స్‌లో కాంగ్రెస్ నారీశక్తి
- ఎల్బీ స్టేడియంలో అమిత్‌షా సమావేశం




**హైదరాబాద్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాజకీయాలు వేడెక్కాయి. కాంగ్రెస్‌లోకి చేరికలు ఊపందుకున్నాయి. కాంగ్రెస్, బిజెపిల్లోకి చేరికలు ఊపందుకున్నాయి. తాజా రాజకీయాలాతో బిఆర్ఎస్ దిక్కుతోచని స్థితికి వెళ్లింది. అధికారం కోల్పోవడంతో బిఆర్ఎస్ నుంచి నేతలంతా వెళ్లిపోతున్నారు. మరోవైపు బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ సభలతో రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. 12వ తేదీ ఈ మూడు పార్టీలు ముఖ్య కార్యక్రమాలను ప్రకటించాయి. తెలంగాణ పాలిటిక్స్‌లో 12వ తేదీ బిగ్ డే కానుంది. మార్చి 12 తెలంగాణలో పొలిటికల్ హీట్ పెంచుతోంది. ఒకేరోజు రంగంలోకి అమిత్ షా, రేవంత్ రెడ్డి , కేసీఆర్ దిగనున్నారు. మంగళవారం కాంగ్రెస్ , బీజేపీ , బీఆర్ఎస్ పోటా పోటీ సభలు నిర్వహించారు. షెడ్యూల్‌కు ముందే పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని పార్టీలు పూరిస్తున్నాయి. అభివృద్ధి పనుల ప్రారంభం, శంకు స్థాపనలతో సీఎం రేవంత్ స్పీడ్ పెంచారు. రేపు పరేడ్ గ్రౌండ్‌లో రేవంత్ మహిళాశక్తి సభ.. మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ ముందే పథకాలను రేవంత్ ప్రారంభించేస్తున్నారు. అలాగే కరీంనగర్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కదన భేరి బహిరంగ సభ నిర్వహించనున్నారు. కాళేశ్వరంపై ప్రభుత్వ వైఖరిని ఎండగట్టి ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసేలా కేసీఆర్ ప్రసంగించనున్నారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభ నిర్వహించనున్నారు. ఒకే రోజు మూడు ప్రధాన పార్టీల సభలతో ఆసక్తిగా తెలంగాణ రాజకీయం ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## కేంద్రం కీలక నిర్ణయం.. అమల్లోకి పౌరసత్వ సవరణ చట్టం




**న్యూఢిల్లీ,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** లోక్‌సభ ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పౌరసత్వ సవరణ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ చట్టం నియమ నిబంధనలను కేంద్ర హోంశాఖ సోమవారం నోటిఫై చేసింది. కాగా, కేంద్ర ప్రభుత్వం 2019 డిసెంబర్‌లోనే పౌరసత్వ సవరణ చట్టానికి సంబంధించిన బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింపచేసుకొన్నది. మతపరమైన హింస కారణంగా 2014, డిసెంబర్ 31 కంటే ముందు పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్గానిస్థాన్ నుంచి భారత్‌కు వలస వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రిస్టియన్ మతస్తులకు పౌరసత్వం ఇచ్చేందుకు ఈ చట్టాన్ని తీసుకొచ్చారు.అయితే 1955 పౌరసత్వ చట్టాన్ని సవరిస్తూ తీసుకొచ్చిన ఈ కొత్త చట్టంలో ముస్లింలను మినహాయించడం వివాదానికి దారితీసింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రధానంగా ఈశాన్య రాష్ట్రాల్లో పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందే ఈ సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్‌ను బీజేపీ సర్కారు తెరపైకి తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిరసనలు, ఆందోళనలు వెల్లువెత్తడంతో సీఏఏ అమలును తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు అప్పట్లో కేంద్రం ప్రకటించింది.తాజాగా ఇప్పుడు కూడా లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్రం పౌరసత్వ సవరణ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఆ మేరకు నిబంధనలను నోటిఫై చేసింది. ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పాటు కేంద్రమంత్రులు సైతం ఎన్నికలకు ముందే సీసీఏను అమలులోకి తీసుకువస్తామని ప్రకటించారు. ఆ మేరకు ఇప్పుడు సీఏఏ అమల్లోకి వచ్చింది.

## చేవెళ్ళ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ముఖ్యనేతలతో కేసీఆర్ భేటీ



**హైదరాబాద్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** బంజారాహిల్స్ నంది నగర్ నివాసంలో కేసీఆర్ చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల కార్యాచరణ, బీఆర్ఎస్ లోక్‌సభ

వివరాలు 2లో

# భద్రాద్రి వేదికగా ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

పాలనను బొందపెట్టి ప్రజలు ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ కు సవాల్ విసిరారు. ఏ ఊరిలో కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చారో ఆ ఊర్లోనే ఆయన ఓట్లు అడగాలని.. ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన గ్రామాల్లో తాము ఓట్లు అడుగుతామని ఛాలెంజ్ చేశారు. పేదలకు ఇళ్లు ఇస్తామన్న బీజేపీ తెలంగాణ రాష్ట్రంలో ఎన్ని ఇళ్లు ఇచ్చిందో చెప్పాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు. 2022 నాటికి అందరికి ఇళ్లు అని చెప్పి మోడీ మోసం చేశారని అన్నారు. ఢిల్లీలో రైతులను బలి తీసుకున్న ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వమని ధ్వజమెత్తారు. కేసీఆర్‌తో పాటు బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్‌లకు కూడా ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. 'తెలంగాణలో ఎన్ని ఇళ్ళు ఇచ్చారో బీజేపీ నాయకులు చెప్పాలి. ఢిల్లీలో రైతులను తుపాకీ తూటాలకు బలి తీసుకుంది మోదీ సర్కార్. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ బీజేపీ నేతలని నిలదీయాలి. కేసీఆర్, మోదీనీ బహిరంగ సభలో బండకేసి ఉతుకుతాం' అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.'ఖమ్మం జిల్లాకు కాంగ్రెస్ కు ఓ బలమైన బంధం ఉంది. అందుకే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఖమ్మం జిల్లాలో ప్రారంభించామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. పేదలకు ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు అందించేందుకు ఈ పథకాన్ని ప్రారంభించాం. నిజమైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం అని రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల బాధ చూసే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రకటించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. 'ఇచ్చిన హామీలను 90 రోజుల్లోగా అమలు చేస్తున్నాం. సొంతింటి కల సాకారం కోసం ప్రజలు పదేళ్లుగా ఎదురు చూశారు. ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించాం. గత ప్రభుత్వాలు కట్టిన ఇళ్లకూ పట్టాలు ఇస్తాం. భద్రాచలం అభివృద్ధికి మా వద్ద కార్యాచరణ ప్రణాళిక ఉందని భట్టి పేర్కొన్నారు. అటు, భద్రాద్రి రాముడిని కూడా కేసీఆర్ మోసం చేశారని.. ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారని.. పదేళ్ల పాలనలో రూ.7 లక్షల కోట్లు అప్పు చేశారని విమర్శించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో పేదలను మోసం చేస్తే.. తాము పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ కమ్యూనిస్టుల మధ్య గతంలో వైరుధ్యాలున్నా నేడు కాంగ్రెస్ సీపీఐ కలసి పనిచేస్తున్నామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు కేసీఆర్‌ను నమ్మలేదన్నారు. రామాలయం అభివృద్ధిపై మంత్రి తుమ్మల చెప్పారని.. రిటైనింగ్ వాల్ కోసం రూ.500 కోట్లు ఈరోజే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. 92 రోజుల్లోనే గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని మరోసారి స్పష్టం చేశారు. 24 కోట్ల మంది ఆడ బిడ్డలు ఉచిత ప్రయాణం చేశారన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంతో పేదల ఆరోగ్యం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆడబిడ్డల కన్నీళ్ళు తుడవడానికి సోనియమ్మ ఆలోచనలతో రూ.500 కే గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తున్నట్లు చెప్పారు. పేదల ఇళ్లకు కరెంట్ బిల్లులు భారం లేకుండా గృహ జ్యోతి పథకం తీసుకొచ్చామన్నారు. 4 లక్షల 50 వేల ఇళ్లు నిర్మాణం కోసం నేడు ఇందిరమ్మ పథకం ప్రారంభించామన్నారు. వేలాది మంది ఆడ బిడ్డల సమక్షంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించామని తెలిపారు. మీడియా రంగంలో ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రులు తుమ్మల, పొంగులేటి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ,ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ , శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యేలు కూనంనేని, తెల్లం వెంకట్రావ్, కోరం కనకయ్య, రాగమయి, జారే ఆదినారాయణ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

- పట్టువస్త్రాలు సమర్పించిన సిఎం రేవంత్ దంపతులు
- మంత్రులు భట్టి, ఉత్తమ్ తదితరుల రాక
- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- తీర్థప్రసాదాలు ఇచ్చి, ఆశీర్వాదం చేసిన పండితులు








**యాదగిరిగుట్ట,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు వేడుకలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీసమేతంగా పాల్గొన్నారు. ఆయనతోపాటు మంత్రులు, ఇతర కాంగ్రెస్ నేతలు పూజల్లో పాల్గొన్నారు. తొలిసారిగా సీఎం హోదాలో యాదగిరిగుట్టకు వచ్చిన రేవంత్ రెడ్డికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు పూజలో పాల్గొన్న రేవంత్ రెడ్డి సతీసమేతంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితుల వేదాశీర్వచాలు తీసుకున్నారు. వారికి వేద పండితులు ప్రత్యేక తీర్థప్రసాదాలు అందించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగిన తొలి రోజు వేడుకలో సీఎం రేవత్‌తోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కొండా సురేఖ, కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ పూజల్లో పాల్గొన్నారు. యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి 11 రోజులపాటు జరుగనున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి యాదగిరి గుట్టకు వస్తున్న వేళ భారీగా కాంగ్రెస్ శ్రేణులు అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాసేపు తోపులాట జరిగింది. కొందరు కాంగ్రెస్ నేతలను గుడి వద్దకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకోవడం చర్చనీయాంశమైంది. పోలీసుల తీరుకు నిరసనగా వారంతా ధర్నా చేపట్టారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారికి సర్దిచెప్పడంతో వారంతా శాంతించి ఆందోళన విరమించారు. ఇకపోతే యాదగిరిగుట్టపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి బ్రహ్మోత్సవాలు కావడంతో ఆ పార్టీ నాయకులు కూడా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. తొలి రోజు స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వస్తీవాచనం, అంకురారోపణం, విశ్వక్సేనారాధన, రక్షాబంధనంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం 11 గంటలకు సీఎం రేవంత్ తో పాటు సీనియర్ మంత్రులు వేడుకల్లో పాల్గొని భద్రాచలం వెళ్లారు. యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి వస్తున్న నేపథ్యంలో కొండపైన దేవస్థానం అధికారులు ఆంక్షలు విధించారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు దర్శనాలను నిలిపివేసారు. కొండపైకి వచ్చే భక్తుల వాహనాలను అనుమతించలేదని స్పష్టం చేశారు. సీఎం, మంత్రుల పర్యటన తర్వాత యధావిధిగా భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. 11 రోజులపాటు జరగనున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలు 21న జరిగే శృంగార డోలోత్సవంతో ముగియనున్నాయి. ప్రధాన ఆలయ ఉద్ఘాతన తర్వాత రెండోసారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్తర మాడ వీధుల్లో స్వామివారి కళ్యాణం నిర్వహించనున్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరిగే 11 రోజులపాటు స్వామి వారికి నిత్య మొక్కు, కళ్యాణాలు, సుదర్శన నారసింహ హవన పూజలను నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు. కాగా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు అధికారులు చెప్పారు.స్వామివారి బ్రహ్మోత్సవాలను వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. పదివేల మంది కూర్చునేలా ప్రత్యేక కళ్యాణ మండపాన్ని ఆలయ అధికారులు సిద్ధం చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న స్వామివారి ఎదుర్కోలు, 18న తిరు కళ్యాణ మహోత్సవం, 19న స్వామి వారి దివ్య విమాన రథోత్సవం నిర్వహించనున్నారు. 13 నుంచి స్వామి వారి అలంకార సేవలు కొనసాగనున్నాయి. ఈనెల 15 నుంచి సంగీత సాహిత్య మహాసభలు జరగ నున్నాయి. బ్రహ్మోత్సవాలు జరిగే 11 రోజులపాటు ఆర్జిత సేవలైన నిత్య, శాశ్వత మొక్కు కళ్యాణాలు, సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం వంటి పూజలను తాత్కాలికంగా రద్దు చేశారు.

# ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి





**ఆత్మకూరు,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు చేయడంలో విఫలమయిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని ఆత్మకూరు మండల కేంద్రంలోని జి.ఎస్.ఆర్. గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన బి.ఆర్.ఎస్.కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చి నేడు ఆ హామీలను అమలుచేయడం విస్మరిచిందన్నారు.బీఆర్ఎస్ పార్టీ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెడుతుందని అన్నారు. రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటుతున్న ఇంకా ఏం అభివృద్ధి పనులు చేయడం లేదని అన్నారు. పల్లెల్లో, పట్టణాల్లో నీళ్లు లేక ప్రజలు ట్యాంకర్ల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కరువు వచ్చిందని అన్నారు.గత పది ఎండ్లలో బిఆర్ఎస్ హయాంలో ఏనాడు ఎలాంటి కరువు పరిస్థితి లేదన్నారు. ప్రజాపాలన అని హడావిడి చేశారే కానీ ఏనాడు ప్రజల సమస్యలు పరిష్కరించింది లేదన్నారు. మూడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఆదరణ కొల్పోతున్నద న్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బి.ఆర్.ఎస్.పార్టీకి ప్రజల మద్ద తు ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని కాంగ్రెస్ మోసాలను ప్రజలకు తెలియచేయాలని పిలుపునిచ్చారు. పరకాల నియోజకవర్గం నుండి అత్యధిక మెజారిటీ మన ఎంపి అభ్యర్థికి ఇవ్వా లని అన్నారు.కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.బిఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. అకారణంగా మా పార్టీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని అన్నారు. కొంత మంది వారి స్వార్ధం కోసం కన్నతల్లి లాంటి పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్ లో చేరుతున్నారని వారి వల్ల బిఆర్ఎస్‌కి నష్టం ఏమీలేదని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, బి.ఆర్.ఎస్. నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## దేశ సాంకేతిక విప్లవంలో మహిళలే కీలకం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రతిపక్షాల తీరును మోదీ తప్పుపట్టారు. నేను మహిళల సాధికారతపై మాట్లాడిన ప్రతిసారీ కాంగ్రెస్ వంటి పార్టీలు అవహేళన చేస్తుంటాయి. మోదీ పథకాలు క్షేత్రస్థాయి అనుభవాలకు లభించిన ఫలితాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం లక్‌పతి దీదీల విజయగాథలను వెల్లడించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక బృందాలకు రూ.2,000 కోట్లు మూలధన సహాయ నిధిని అందించారు. దీంతోపాటు ఈ బృందాలకు రూ.8,000 కోట్లు విలువైన బ్యాంక్ రుణాలను అందించారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా 1,000 మంది మహిళలకు డ్రోన్లను పంపిణీ చేశారు. ఇప్పటికే వీటి వినియోగంపై వీరికి శిక్షణ ఇచ్చారు. ఈ పథకం కింద దాదాపు 15,000 స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలకు వ్యవసాయంలో వీటి వాడకంపై శిక్షణ ఇవ్వాలన్నది దీని లక్ష్యం. పంట పర్యవేక్షణ, ఎరువుల పిచికారీ, విత్తనాలు వేయటం వంటివి నేర్పిస్తారు.ముచ్చటగా మూడోసారి కేంద్రంలో బీజేపీ సర్కార్ అధికారంలోకి వస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. మూడోసారి తానే ప్రధానిగా బాధ్యతలు చేపడతానని.. మహిళలే ప్రాధాన్యతగా పథకాలు తీసుకొస్తామని స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హయాంలో మహిళల జీవితాలు దుర్భరంగా ఉండేవి. వారికి సాయం చేయడానికి బీజేపీ అన్నివిధాలా సహకరిస్తోంది. మరుగుదొడ్ల ఉపయోగం, శానిటరీ ప్యాడ్‌ల వాడకం, కలప, బొగ్గు వంటి వాటి వల్ల కలిగే దుష్పరిణామాలు, బ్యాంకు ఖాతాల ఆవశ్యకత వంటి అనేక విషయాలను మహిళలకు వివరించాను. ఇలా చేసినందుకు నన్ను కాంగ్రెస్ వంటి పార్టీలు ఎగతాళి చేసి, అవమానించాయి. వివిధ ప్రభుత్వ పథకాల కింద రూ.8 లక్షల కోట్లకుపైగా మహిళలకు పంపిణీ చేశాం. మహిళలకు చిన్నపాటి సాయం చేసినా వారు ఇతరులకు సాయం చేస్తారనేది నా అనుభవంలో తెలుసుకున్నాను. తమ కుటుంబాల కోసం ఆలోచించే రాజకీయ నాయకులు ఈ అంశాల గురించి ఎప్పుడూ అర్థం చేసుకోలేరు' అని మోదీ విమర్శించారు. 'సశక్త్ నారీ-విక్షిత్ భారత్' భాగంగా స్వయం సహాయక బృందాలకు బ్యాంకు రుణాలుగా దాదాపు రూ.8,000 కోట్లను మోదీ పంపిణీ చేశారు.

## స్వామి సన్నిధిలోనే భట్టికి అవమానం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పాలన్నారు. ఇవాళ మహిళలకు 47శాతం రిజర్వేషన్లతో ఉద్యోగాలు ఇచ్చామని రేవంత్‌రెడ్డి అబద్దాలు చెప్పారన్నారు. గురుకులాల్లో 85శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఆనాడు కేసీఆర్ జీవో ఇచ్చారని.. దాన్ని కాంగ్రెస్ తీసివేసిందన్నారు. సీఎం చెప్పేవన్నీ అబద్దాలేనని.. యువతను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. విద్యార్థులను మోసం చేయొద్దని.. బీసీలకు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందు కోసమే రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కులగణన విషయంలో కాలయాపన చేయొద్దని.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనన్నారు. ఖచ్చితంగా లోకల్ బాడీ ఎన్నికలకు ముందే 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అందరికీ అండగా తాము అండగా ఉంటామని.. జై భీం.. జై బీసీ, జై పూలే నినాదంతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

## చేవెళ్ళ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ముఖ్యనేతలతో కేసీఆర్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థిపై సమావేశంలో చర్చిస్తున్నారు.ఈ సమావేశానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు పైలట్ రోహిత్ రెడ్డి, మెతుకు ఆనంద్, మహేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు కాసాని జ్ఞానేశ్వర్, సబితా ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డితో పాటు పలువురు హాజరయ్యారు.

## భట్టిని కింద కూర్చోబెట్టారు

- దళితజాతికి తీరని అవమానం
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శలు

**హైదరాబాద్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి సాక్షిగా డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అవమానం జరిగిందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. సోమవారం నాడు మీడియాతో మాట్లాడుతూ... రెడ్డి నాయకుల దగ్గర ఒక ఎస్సీ బిడ్డను క్రింద కూర్చోబెట్టారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సతీమణినిపైన కూర్చోబెట్టి బీసీ బిడ్డ అయిన కొండా సురేఖను కింద కూర్చోబెట్టారన్నారు. దేవుడి దగ్గరే ఇంత అవమానం జరిగితే దళిత జాతి ఎక్కడ చెప్పుకోవాలి?... ఎవరికి చెప్పుకోవాలని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడైనా భట్టి విక్రమార్కనే అవమానించారన్నారు. 4 యేండ్ల స్వాతంత్ర భారతంలో దళితులకు కాంగ్రెస్ పార్టీలో అవమానం జరుగుతుందన్నారు. యావత్ దళిత జాతిని ఈరోజు అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి భట్టి విక్రమార్క ఫోటో పక్కన పెడుతున్నారని.... ప్రభుత్వ యాడ్స్‌లో డిప్యూటీ సీఎం ఫోటోను పక్కన పెట్టారన్నారు. జరిగిన ఘటనపై నయా దేశ్ ముఖ్ సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్**






**హనుమకొండ జిల్లా స్టాపర్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో కాజీపేట ఫాతిమానగర్ లోని సెయింట్ గాబ్రియేల్ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతి సాధించగా సోమవారం పాఠశాలలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతు విద్యార్థులు శాస్త్రీయ అవగాహనను పెంపొందించుకోవడమే కాకుండా నిత్యజీవితంలో కూడా ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి శాస్త్రీయంగా ఆలోచించాలన్నారు. జన విజ్ఞాన వేదిక సంస్థ సమాజంలోని మూఢనమ్మకాల నిర్మూలనకు పాటుపడుతూ , విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తూ విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని కలిగించడానికి గత మూడు దశాబ్దాలుగా చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్ హై మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో హనుమకొండ జిల్లా నుండి సెయింట్ గాబ్రియేల్ పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించినందులకు అభినందనలు తెలిపారు. ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు బి సాత్విక్ రెడ్డి, పి నైధ్రువ, వై వరుణ్, గైడ్ టీచర్ ఎం. శిరీషలకు సర్టిఫికెట్ల ప్రదానంతో పాటు బహుమతులుగా టెలిస్కోపు, మైక్రోస్కోపులను కలెక్టర్ చేతుల మీదుగా సెయింట్ గాబ్రియేల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆంథోనీ కి జన విజ్ఞాన వేదిక వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక చెకుముకి ఇంచార్జి నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు, జన విజ్ఞాన వేదిక బాధ్యులు డాక్టర్ రాములు, కాజీపేట పురుషోత్తం, ప్రొఫెసర్ రామారావు, ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాజీపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి





**హనుమకొండ జిల్లా స్టాపర్, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** సోమవారం కాజీపేట చౌరస్తాలో 62వ, 63వ డివిజన్ లో రూ. 3 కోట్ల నిధులతో కాజీపేట పోలీస్ స్టేషన్ నుండి సోమిడీ బొంద్రాయి వరకు 60ఫీట్ల రోడ్డులు, డివైడర్ ద్వారా ఇరువైపులా లైటింగ్స్ తో, కాజీపేట నుండి సోమిడీ వరకు నూతనంగా వాటర్ పైప్లైన్ లకు, అభివృద్ధి కార్యక్రమాలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జక్కుల రమరవీందర్ యాదవ్, 62వ డివిజన్ కార్పొరేటర్, 63వ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ విజయశ్రీ- రజాలి కలిసి శంకుస్థాపన చేసారు. కాజీపేట అభివృద్ధి శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కి డివిజన్ వాసులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంతవరకు కాజీపేట అభివృద్ధికి నోచు కోలేదంటూ ఇప్పుడు మన కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక రంగాల్లో హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణం అభివృద్ధి చెందుతుందని, కాంగ్రెస్ పార్టీ అంటేనే అభివృద్ధి అని, కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్ అంటేనే ప్రజల పార్టీ అని, వీలైనంత త్వరలో అనేక రంగాల్లో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. కాజీపేట పట్టణాన్ని వీలైనంత త్వరలో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇవ్వడం జరిగింది. మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్, రావుల సదానందం, రమణారెడ్డి, సుంచు అశోక్, గుంటి కుమార్, పిఏసిఎస్ డైరెక్టర్ మెరుగు రాజయ్యయాదవ్, బంక సంపత్, డాక్టర్ శ్రావణ్ కుమార్, అంకుష్, జయకర్, వీరస్వామి, ఇన్నారెడ్డి, ఎన్.వి రాజ, మేకల ఉపేందర్, ఆరూరి సాంబయ్య, సిరిల్ లారెన్స్, సుధాకర్, నీలక్క, రవికిరణ్, బైరబోయిన రమేష్, దొంగల కుమార్, బర్లబిరాజ్ కుమార్, గుర్రం అమర్నాథ్, బుర్ర బాబు, ఆంజనేయులు, అశోక్, పాక భాస్కర్, శివరాం, బోంద్యల్, కిరణ్, భరత్, శ్రీశైలం, రేవంత్, మధు, నవీన్, రమేష్, రంగు సుధీర్, ప్రశాంత్ రెడ్డి, సురేష్, రవి, మహిళ నాయకురాలు, కాజీపేట ఆల్ వింగ్ ఆఫీసర్లు, రైల్వే పెన్షన్ అసోసియేషన్ సభ్యులు, కాజీపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, 62వ 63వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాంగ్రెస్ పార్టీ సైనికులు, తదితరులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మహిళా సదస్సుకు జిల్లా నుండి వెళ్లే మహిళలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**హనుమకొండ జిల్లా స్టాపర్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మంగళవారం జరగనున్న మహిళా సదస్సు కు జిల్లా నుండి మహిళలు వెళ్లేందుకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డిఆర్డిఏ, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో మహిళా సదస్సు విజయవంతం పై , ప్రజా పాలన సేవా కేంద్రాల నివేదిక సమన్వయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. మహిళా సదస్సుకు మహిళలు వెళ్లేందుకు బస్సులతోపాటు అల్పాహారం, భోజన, ఇతర వసతులను అధికారులు సమన్వయంతో ఏర్పాటు చేయాలన్నారు. ఆయా ప్రాంతాల నుండి బయలుదేరడం మొదలుకుని మీటింగ్ అనంతరం మళ్ళీ గమ్యం చేరే వరకూ అంతా సాఫీగా ఉండేవిధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. జిల్లా నుండి పన్నెండు వందల మంది సభ కు వెళ్తుండగా అందుకు అన్నీ ఏర్పాట్లు ఎక్కడ కూడా ఇబ్బంది లేకుండా అధికారులు చూసుకోవాలన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాలలో ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటి సవరణలు ఎలా జరుగుతున్నాయని, వివరాలను ఎంపీడీవోలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా సదస్సు సంబంధించిన పలు ఏర్పాట్లను గురించి డిఆర్డిఓ నాగజ్యోతి వివరించారు. ప్రతి మండలానికి రెండు బస్సులను ఏర్పాటు చేస్తున్నామని, మండలం నుండి వందమంది చొప్పున సదస్సుకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బస్సులో ఏపీఎం లైజన్ అధికారిగా ఉంటారని, అసిస్టెంట్ లైజన్ అధికారి, ఒక



పోలీస్ పర్సన్ ఉంటారని అన్నారు. ఘట్ కేసర్ వద్ద ఒక ఫంక్షన్ హాల్లో భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమన్వయంతో విజయవంతంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో విద్యాలత, డిపీవో లక్ష్మి రమాకాంత్, అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాసరావు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# ఆపద మిత్ర వాలంటీర్ల మొదటి బ్యాచ్ శిక్షణ కేంద్రాన్ని 13న ప్రారంభించాలి

**- జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి**

**హనుమకొండ జిల్లా స్టాపర్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రకృతి విపత్తుల సమయంలో సేవలు అందించేందుకు ఎంపిక చేసిన ఆపద మిత్ర వాలంటీర్ల మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని ఈ నెల 13వ తేదీన ప్రారంభించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఆపద మిత్ర వాలంటీర్ల ఎంపిక పై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రశాంతంగా శిక్షణ కార్యక్రమం సాగేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆపద మిత్ర వాలంటీర్ల ఎంపిక చేపట్టనుండగా అందులో యాభై శాతం మహిళలు ఉండే



విధంగా చూడాలని అన్నారు.ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ విద్యార్థులను ఆపద మిత్ర వాలంటీర్లుగా ఎంపిక చేయాలన్నారు. మొదటి దశ శిక్షణ అనంతరం ఎంపిక చేసే అభ్యర్థులకు దశల వారిగా శిక్షణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక అధికారి మామిడి భగవాన్ రెడ్డి మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రజల ప్రాణ రక్షణలో ఆపద మిత్ర వాలంటీర్లు సేవలందిస్తారని అన్నారు. జిల్లాలో ఇప్పటికే నూట యాభై మంది వాలంటీర్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. మరో నూట యాభై మంది వాలంటీర్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల శారీరక, మానసిక ఆరోగ్య ప్రమాణాల ఆధారంగా ఆపద మిత్ర వాలంటీర్ల ఎంపిక జరుగుతుందన్నారు. ఆపద మిత్ర వాలంటీర్లకు హసన్ పర్తి లోని టీటీడీసీ, రామారం సమీపంలోని సహ వికాస భవనంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీపీవో లక్ష్మి రమాకాంత్, డిస్ట్రిక్ట్ యూత్, స్పోర్ట్స్ ఆఫీసర్ అశోక్ కుమార్, డీఎంహెచ్వో డాక్టర్ సాంబశివరావు, పరకాల పురపాలక కమిషనర్ నరసింహ, సామాజికవేత్త ఈ. వి. శ్రీనివాస్ రావు, డిఎంసీ రజిత రాణి, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖ, కాంగ్రేస్ నాయకులు కొండా మురళిలను కలిసిన డాక్టర్ బరిగెల రమేష్

**హసన్‌పర్తి, మార్చి 11(పిసిడబ్ల్యు న్యూస్):** రాష్ట్ర మంత్రి వరంగల్ పార్లమెంట్ ఇంఛార్జి శ్రీమతి కొండా సురేఖ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండా మురళి, లను కలిసిన వరంగల్ ఎం పి ఆస్పిరెంట్ మెడికల్ జాక్ చైర్మన్ డాక్టర్ బరిగెల రమేష్ మలిదశ తెలంగాణ ఉద్యమనాయకుడు, ప్రత్యేక తెలంగాణ వైద్యుల





సంఘం ఏర్పాటు కోసం అహర్నిశలు శ్రమించి తెలంగాణ ఉద్యమంలో వైద్యులను భాగస్వామ్యం చేసానని తెలంగాణ ఉద్యమకారుడైన నాకు వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరారు.ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర ముఖ్య నాయకులు మాట్లాడుతూ వైద్యుల సేవలు, పోరాటం ను గుర్తించి వైద్యుల బృందం నుండి డాక్టర్ బరిగెల రమేష్ కి ఎంపీ గా అవకాశం ఇవ్వాలన్నారు.ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి వారికి వైద్య బృందం కృతజ్ఞత లు తెలుపుతూ మాకు సముచిత స్థానం కాంగ్రెస్ పార్టీ కల్పిస్తుందని ధీమా వ్యక్తం చేసారు.ఉద్యమకారులు, మేధావులు, ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగస్తులు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల మద్దతు ఉన్న తనకే వరంగల్ పార్లమెంట్ టికెట్ వస్తుందనే ధీమా వ్యక్తం చేసారు డాక్టర్ బరిగెల రమేష్.

# రాష్ట్ర హజ్ బోర్డ్ చైర్మన్ ఖుస్రో పాషా కలిసిన రహత్ పర్వీన్, మహ్మద్ ఖాజా



**హనుమకొండ జిల్లా స్టాపర్, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర హజ్ బోర్డ్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన ఖాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రో పాషాని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర మైనార్టీ శాఖ ప్రధాన కార్యదర్శి రహత్ పర్వీన్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మహమ్మద్ ఖాజా పాషా వరంగల్ డిస్ట్రిక్ట్ మైనార్టీ వైస్ చైర్మన్ మహమ్మద్ జమిరుద్దీన్ ఉన్నారు.

# రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అస్మతుల్లా హుస్సేన్ కలిసిన మహమ్మద్ అంకుష్



**హనుమకొండ జిల్లా స్టాపర్, మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లోని వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ గా అస్మతుల్లా హుస్సేన్ బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మహమ్మద్ అంకూస్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం



**హనుమకొండ జిల్లా స్టాపర్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఆర్ఓ వై.వి గణేష్, వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లా ఉన్నాతాధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం 176 వినతులు అందాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిపివో సత్యనారాయణ రెడ్డి, డీఎంహెచ్వో డాక్టర్ సాంబశివ రావు, బీసీ వెల్ఫేర్ డిడి రామ్ రెడ్డి, మైనారిటీ వెల్ఫేర్ డిడి మేన శ్రీను, జిల్లాకు చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర హజ్ బోర్డ్ చైర్మన్ ఖుస్రో పాషా ను కలిసిన కాంగ్రెస్ పీసీసీ కార్యదర్శి రజాలి



**హనుమకొండ జిల్లా స్టాపర్, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర హజ్ బోర్డ్ చైర్మన్ గా ఖాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రో పాషా సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని, కాంగ్రెస్ పీసీసీ కార్యదర్శి రజాలి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, పార్టీ శ్రేణులు, నాయకులు ఉన్నారు.


## ప్రజానాట్య మండలి కళాకారుడు సోమయ్య మృతికి సిపిఐ నివాళి



**కురవి,మార్చి11(పిసిడబ్ల్యూన్యూస్):** ప్రజానాట్య మండలి కళాకారునిగా ప్రజలను చైతన్యవంతం చేసిన కళాకారుడు బయ్యపోతుల సోమయ్య మృతి పట్ల సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి, రాష్ట్ర సమితి సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి ,కట్టబోయిన శ్రీనివాసులు పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు.స్టేషన్ గుండ్రాతి మడుగు గ్రామానికి చెందిన సోమయ్య సిపిఐ అనుబంధం ప్రజానాట్యమండలిలో అనేక సంవత్సరాలు పని చేసిన మంచి కళాకారుడుగా ఈ ప్రాంతంలో గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి ,కొంతకాలం సిపిఐ పార్టీలో పనిచేశారు వారి మృతి కళాకారులకు తీరనిలోటని నాయకులు కొనియాడారు. మారగాని వీరభద్రం పోతుల రామ్మూర్తి సారిక శ్రీనివాస్ పోలేపాక వెంకన్న కామ సంజీవరావు వీరేందర్ బండి ఉప్పలయ్య బండి ఎతిరాజ్ తదితరులు వారికి నివాళి అర్పించారు.

## మైనార్టీలకు కుట్టు మిషన్లు పంపిణీ పథకంలో అవకతవకలు

**- రామడుగుమండల మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి.సలావుద్దీన్**



**రామడుగు,మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలం చొప్పదండికి సంబంధించిన మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ చేసే పథకంలో లబ్ధిదారులను సెలెక్ట్ చేసి వారిని ఆన్లైన్లో నమోదు చేసి తీరా సమ యానికి కుట్టు మిషన్లు పంపిణీ మాత్రం చేయకుండా వాటిని అప్పటి బీఆర్ఎస్ నాయకులు పక్కదోవ పట్టించారు దీనిపైన పూర్తిస్థాయి విచారణ చేపట్టగలరని కరీంనగర్ జిల్లాకలెక్టర్ కి ప్రజావాణిలో కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

## స్టేట్ లెవల్ హ్యాండ్బాల్ పోటీల్లో సత్తాచాటిన సరస్వతి ఇంగ్లీష్ మీడియం విద్యార్థి ప్రతిభ



**రామడుగు, మార్చి11(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలం వెలిచాల గ్రామంలోసరస్వతి ఇంగ్లిష్ మీడియం విద్యార్థి 45వ స్టేట్ లెవెల్ హ్యాండ్ బాల్ పోటీలలో దైవాల ప్రణీశ్ సెకండ్ ప్లేస్లో నిలిచినట్లు స్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. 8 నుంచి 10 వ తేదీ వరకు వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కరీంనగర్ జట్టు తరపున పాల్గొని ద్వితీయస్థానంలో నిలిచి నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థి ప్రణీశ్, కోచ్ సాయికృష్ణను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ కో కరస్పాండెంట్ ఉప్పుల సత్యం పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్లో ఓ కేసులో నిందితుడి జన్మదిన వేడుకలు నిర్వహించిన ఎస్సై

**- ఎస్సై మాధవ్ గౌడ్పై బదిలీ వేటు**



**చిట్యాల,మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి ఎస్ఐ మాధవ్ గౌడ్ పై బదిలీ వేటు పడింది.ఈనెల మార్చి 4. తేదీన.జయశంకర్ భూపాల పల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఓ కేసుల్లో నింది తుడి జన్మదిన వేడుకలు ఎస్ఐ మాధవ్ గౌడ్ నిర్వహించారు ఆ ఫోటోలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో విచారణ చేపట్టి ఎస్ఐ మాధవ్ గౌడ్ ను ఆసిఫాబాద్ వీఆర్ఏకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నత అధికారులు.



## అంగరంగ వైభవంగ గంగ భవానీ విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవం

**- భక్తజనంతో పులకించిన పురుషోత్తమాయ గూడెం ....**

**- మార్మోగిన అమ్మవారి స్మరణ...**

**- ఆలయ శాశ్వత చైర్మన్ నూకల అభినవ్ రెడ్డి...**

**- నేతృత్వంలో నేత్ర పర్వంగా హోమం గోపురం ప్రతిష్ట...**



**మరిపెడ,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజక వర్గ కేంద్రమైన మరిపెడ మండలము పురుషోత్తమాయ గూడెం అకేరు ఒడ్డు పై రూ.50లక్షల వ్యయంతో బీ ఆర్ యస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకుడు నూకల నరేష్ రెడ్డి తన సొంత ఖర్చు తో అబ్బుర పరిచే గంగ భవానీ ఆలయ నిర్మాణం నిర్మించారు. రూ.1కోటి వ్యయంతో పురుషోత్తమాయ గూడెంలో అభయ ఆంజనేయ ఆలయం నిర్మాణం చేపట్టిన కొద్ది రోజుల్లోనే అమ్మవారి ఆలయ క్షేత్ర నిర్మాణం కోసం నడుం కట్టారు.. సకల దేవుళ్ళ నిండైన దీవెనలతో ఆలయాలు భక్త జన సందోహం తో కళకళలాడుతున్నాయి. సోమవారం అర్చకులు పాకాల రఘు రాం శర్మ అద్వర్యంలో జరిగిన పూజ క్రతువుల్లో హోమం, గో మాత పూజ, శ్రీ శ్రీ శ్రీ గంగా భవాని దేవత విగ్రహ ప్రతిష్ట నేత్ర పర్వంగా సాగింది.. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. జాటోతు రామ చంద్రు నాయక్, మాజీ ఎంపీ సురేందర్ రెడ్డి జిల్లా నాయకులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి ప్రజా ప్రతినిధులు నాయకులు భక్తులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు పెట్టే విధానాన్ని విరమించుకోవాలి

**- మరిపెడ ప్రాజెక్టు నాయకురాలు బి పుష్ప**



**మరిపెడ,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంగన్వాడీలకు కనీస వేతనం ప్రకటించకుండా సీసీ కెమెరాలు పెట్టి పని భారం పెంచడం సరైంది కాదని, సీసీ కెమెరాలు పెట్టే విధానాన్ని ప్రభుత్వం వెంటనే వెనుకకు తీసుకోవాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ ఎల్పర్స్ యూనియన్ (సిఐటియు)మరిపెడ ప్రాజెక్టు నాయకురాలు భాషిపంగు పుష్ప అన్నారు. సోమవారం మరిపెడ పట్టణ కేంద్రంలోని ఐసిడిఎస్ సిడిపిఓ శిరీష కు వారు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పుష్ప మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలతో ఇచ్చిన విధంగానే సెలవులు వర్తింపచేయాలని, మే నెల అంతా సెలవు ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన మొబైల్ ఫోన్ లో ఆన్లైన్ సర్వేలుచేయలేకపోతున్నామని, వాటి స్థానంలో కొత్త మొబైల్ లు అందించాలని కోరారు. లేనియెడల పాత మొబైల్ ఫోన్లను ప్రభుత్వానికి వాపసిస్తామన్నారు. తదితర సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 12న కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల నాయకురాలు గుమ్మడి కళవతి, దోమల శ్రీలత, ఎం ఉమారాణి, తదితరులు ఉన్నారు.

## పుసాల గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టాపనకు తీర్మానం...



**సుల్తానాబాద్, మార్చి11(పిసిడబ్ల్యూ న్యూస్):**సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి పూసాలలోని బొడ్రాయి గ్రామ దేవతలను ప్రతిష్టించాలని అన్ని కులాల పెద్దమనుషుల సమక్షంలో సోమవారం తేదీ నిర్ణయించు కోవడానికితీర్మానించడం జరిగింది,ఎన్నో సంవత్సరాల క్రింద చేసినటువంటి భూలక్ష్మి ఊరు కొలుపులు బొడ్రాయి విగ్రహాల ప్రతిష్టాపన కొరకు అన్ని కులాలు పాల్గొని కమిటీ వేయడం జరిగింది, కులానికి కొంతమంది చొప్పున కమిటీలను వేసుకొని, భూలక్ష్మిని బొడ్రాయిని ఊరు కొలుపు గ్రామదేవతల కొలుపు చేసుకోవడానికి పూసాల ప్రజలందరూ ఏకమై తీర్మానం చేసుకొని ముందు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ బొడ్రాయి గ్రామదేవతల కార్యక్రమం ఆపదలో ఉన్నప్పుడు గ్రామదేవతలే తమ కష్టాలు నష్టాల నుంచి కాపాడతారని అమ్మవార్లకు ప్రతికగా ఊరు మధ్యలో బొడ్రాయిని ప్రతిష్టిస్తారని, ఏటా కొలుపులు పూజలు చేస్తారు.ఆ సమయంలో ఊరంతా ఏకమై కులమతాలకు అతీతంగా జాతర లా జరుపుతారని కొంతమంది పెద్దమనుషులు అంటున్నారు.ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు అన్ని కులాల పెద్ద మనుషులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సుల్తానాబాద్ మున్సిపాలిటీలో శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్

**- చైర్పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు**

**సుల్తానాబాద్,మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** నిత్యం వార్డు సమస్యలను పరిష్కరించేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్విరామంగా కొనగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు పేర్కొన్నారు సోమవారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు శ్రీరామ్ నగర్లో పారిశుధ్య పనులను చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ వార్డు ప్రజలు కాలనీలను పరిశుభ్రంగా ఉంచేందుకు బాధ్యతగా వ్యవహరించాలని కాలనీలు శుభ్రంగా ఉంచుకునేందుకు మురుగు కాలువలలో చెత్త చెదారం వేయవద్దని సింగిల్ యుజ్ ప్లాస్టిక్ కవర్లు వంటి వస్తువులను పూర్తిగా నిషేధించాలని వాటి ద్వారా అనేక ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు.కాలనీలలో రోడ్ల పై గాని ఇంటి చుట్టుపక్కల ఎలాంటి పిచ్చి మొక్కలు చెత్త చెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకుంటే దోమలు ఈగలు దరిచేరకుండా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గారితో పాటు 9వ వార్డ్ కౌన్సిలర్ గొట్టెం లక్ష్మి మల్లయ్య సానిటరీ ఇన్స్పెక్టర్ శ్రవణ్ కుమార్ జవాన్ ఆనంద్లతోపాటు కాలనీవాసులు పలువురు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ చారిత్రాత్మక నిర్ణయం

**- పిఆర్టియు నడికూడ అధ్యక్షులు అచ్చ సుదర్శన్**



**నడికూడ, మార్చి11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలలకు, కళాశాలకు ఉచిత విద్యుత్ అందిస్తామని నిన్న సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై పి ఆర్ టి యు నడికూడ మండల శాఖ అధ్యక్షులు అచ్చ సుదర్శన్ హర్షం వ్యక్తం చేశారు. నిన్న జరిగిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సీఎం సమావేశం నిర్వహించడం ఒక మంచి సంప్రదాయమని ఈ సమావేశంలో ఉపాధ్యాయ సమస్యలపై సబ్ కమిటీని ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని అన్నారు. పేద ప్రజలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్న సీఎం అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు చెందిన పేద విద్యార్థులు చదువుతారు కాబట్టి వారి ఆయా పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు గతంలో కరెంటు బిల్లులపై ఎందరో ప్రధానోపాధ్యాయులకు విద్యుత్ శాఖ నుండి మేమో లు కూడా రావడం జరిగిందన్నారు ప్రజా పాలనలో చాలామంది ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, స్కావెంజర్స్ ను ఇవ్వాలని దరఖాస్తులు అధికారులకు చేసినారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి పాఠశాలకు ఉచిత విద్యుత్ మరియు స్కావెంజర్ ప్రకటనపై పి ఆర్ టి యు నడికూడ మండల శాఖ అధ్యక్షులు అచ్చ సుదర్శన్ హర్షం వ్యక్తం చేస్తూ, రేపు జరగబోయే సబ్ కమిటీలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన డిఎ లపై సముచిత నిర్ణయం తీసుకుంటారని అదేవిధంగా పిఆర్సి త్వరలో అమలు చేస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై నేడు అవగాహన కార్యక్రమం

**హనుమకొండ జిల్లా స్టాపర్, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నేడు (మంగళవారం) జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తు న్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఎం. హరి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా స్వయం ఉపాధి ప్రాతిపదికన చేతివృత్తుదారులు, హస్త కళాకారులు అంటే వడ్రంగి, స్వర్ణకారులు, కమ్మరి, కుమ్మరి, మేదర, రజక,నాయి బ్రాహ్మణ , పూలమాలలు తయారు చేసేవారు, తాపీ మేస్త్రిలు మొదలైన వారికి మంగళవారం(12.3.2024) ఒకరోజు అవగాహన సదస్సు ను కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ హాజరై సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## సిపి సునీల్ దత్తును కలిసిన తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ



**ఖమ్మం, మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** దండోరా ఉద్యమంలో 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేసిన మాదిగ ఉద్యమ కారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కేంద్రం ప్రకాష్ నగర్ కమిషనరేట్ ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం ఇచ్చి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పడిశాల వెంకన్న మాదిగ , జిల్లా అధికార ప్రతినిధి సక్కుర్తి కోటేశ్వరరావు మాదిగ , ప్రచార కార్యదర్శి కనకపుడి వీరస్వామి మాదిగ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికార ప్రతినిధి దుప్పటి ప్రకాష్ బాబు మాదిగ , వైరా నియోజకవర్గ ఇన్చార్జి నంద్రు వెంకన్న మాదిగ , యువసేన జిల్లా అధ్యక్షులు జెర్రిపోతుల నరేష్ మాదిగ , మాదిగ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కొండపల్లి మధు మాదిగ , అధ్యక్షులు చెరుకుపల్లి చిన్న భద్రయ్య మాదిగలు పాల్గొన్నారు.

## బిఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రాంబాబు నాయక్

**- బిఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బాణోత్ రాంబాబు నాయక్ ను ప్రకటించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**



**ఖమ్మం, మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బిఎస్పీ వైరా నియోజకవర్గ ఇంఛార్జి, వైరా పట్టణానికి చెందిన ఉన్నత విద్యావంతులు, సాఫ్ట్వేర్ ఇంజనీర్ బాణోతు రాంబాబు నాయక్ ను ఆదివారం సాయంత్రం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నియమించారు. ఈ సందర్భంగా బాణోత్ రాంబాబు నాయక్ మాట్లాడుతూ... మంచి వ్యక్తిత్వం, విద్య, సేవా దృక్పథం, మహనీయుల చరిత్ర ఆధారంగా పనిచేసే వ్యక్తులకు బిఎస్పీలో తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీతో బీఆర్ఎస్ పొత్తులో భాగంగా ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరావు గెలుపునకు సమన్వయ కమిటీలను ఏర్పాటుచేసి బీఆర్ఎస్ గెలుపుకు కృషి చేస్తామని అన్నారు. అదేవిదంగా గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ బలోపతానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. బీఎస్పీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ టిఆర్ఎస్ తరపున పోటీచేస్తున్న నామా నాగేశ్వరావును గెలిపించి కానుకగా ఇస్తామని హామీ ఇచ్చారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన రాంబాబు నాయక్ ను జిల్లా నాయకులు బానోత్ రజినీ బాయి, మంజుల, వైరా నియోజకవర్గ నాయకులు నల్లగట్ల ప్రవీణ్, మహేష్, వాసు, ఆదినారాయణ, కృష్ణార్జున తదితరులు అభినందించారు.

# ప్రజా సమస్యల పట్ల అలసత్వంతో వ్యవహరిస్తే చర్యలు తప్పవు

**- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**





**పెద్దపల్లి జిల్లా, మార్చి 11: (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత కల్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ, అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్‌లతో కలిసి పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు.జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఓదెల మండలం కొలనూర్ గ్రామానికి చెందిన తోట సంతోష్ తాను దివ్యాంగుడి నని తనకు సదరం సర్టిఫికెట్ వచ్చినప్పటికీ పెన్షన్ రావడంలేదని దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పెద్దపల్లి పట్టణం జ్యోతినగర్ కు చెందిన నూతి రామస్వామి తన కుమారుడు ఆస్తి పంపకం చేయమని ఇంటికి వచ్చి చిత్రహింసలకు గురి చేస్తున్నారని, తనకు తన భార్యకు రక్షణ కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారికి రాస్తూ సీనియర్ సిటిజన్ సంరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో విధులకు హాజరయ్యే ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, సకాలంలో కార్యాలయ విధులకు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి సకాలంలో హాజరు కావాలని పలుమార్లు సూచించినప్పటికి పలు అధికారులు ఆలస్యంగా రావడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, భవిష్యత్తు లో తీరు మార్చుకోవాలని లేని పక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కార్యాలయ పని వేళల్లో జిల్లా అధికారులు క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్లే పక్షంలో కార్యాలయంలో బాధ్యత గల మరో అధికారి అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, వివిధ పనులపై ప్రభుత్వ కార్యాల యాలకు వచ్చే ప్రజలతో కార్యాలయ సిబ్బంది మర్యాదగా ప్రవర్తిం చాలని కలెక్టర్ సూచించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని పలు కార్యాలయాలలోని సిబ్బంది తమ సమస్యలు తెలిపేందుకు వస్తున్న ప్రజలతో బాధ్యతారహితంగా, అమర్యాదగా ప్రవర్తిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ప్రతి జిల్లా అధికారి తన కార్యాలయ పరిధిలో సమావేశం నిర్వహించుకుని ప్రజలతో వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రజా సమస్యలు తెలియజేసేందుకు కార్యాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని, ప్రజలకు సేవ చేసేందుకే ప్రభుత్వం మనకు జీతం చెల్లిస్తుందని ఆ అంశాన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచు కోవాలని, ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన, ప్రజలతో అమర్యాదగ మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడనని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను అత్యధిక ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మనకు వచ్చే దరఖాస్తుల పరిష్కారానికి పై కార్యాలయాలకు పంపితే, ఆ దరఖాస్తుల స్థితిగతులపై నిరంతరం ఫాలో అప్ చేయాలని, మన సొంత సమస్య పరిష్కారానికి ఏ విధంగా పరితపిస్తామో, అదే శ్రద్ధతో మన కార్యాలయానికి వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారం అయ్యేవరకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న ప్రతి జిల్లా అధికారి కార్యాలయంలో అవసరమైన సదుపాయాల కల్పనకు తమ వంతు సహకారం అందిస్తామని, ప్రతి జిల్లా అధికారికి తప్పనిసరిగా ప్రత్యేకమైన క్యాబిన్ ఉండే విధంగా అవసరమైన పార్టీషన్ చేసుకోవాలని, అదేవిధంగా కార్యాలయానికి అవసరమైన సామాగ్రి, ఇతర వసతుల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి సిహెచ్. మధుమోహన్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డిసిపి మహమ్మద్ భారీపై ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన జర్నలిస్టులు

**హనుమకొండ స్టాపర్, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎస్ఎన్ఎం క్లబ్ వద్ద అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన పలు మంత్రుల కార్యక్రమంలో తూర్పు జర్నలిస్టులపై పరుష పదజాలంతో దూషించిన వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపి భారీ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం ప్రెస్ క్లబ్ బాధ్యులు,పలు జర్నలిస్టులు సంఘాల నాయకులు సీపీకి ఫిర్యాదు చేశారు. వరంగల్ నుండి హనుమకొండ ప్రెస్ క్లబ్ కి భారీగా తరలివెళ్ళిన తూర్పు జర్నలిస్ట్ లు,ప్రెస్ క్లబ్ సభ్యులు, నల్ల బ్యాడ్జిలతో డిసిపి భారీ కి వ్యతిరేకంగా జర్నలిస్టులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని నిరసన తెలిపారు. వరంగల్ ప్రెస్ క్లబ్ నుండి 250 మంది జర్నలిస్టులతో కలిసి ర్యాలీగా తరలి వెళ్లి పోలీస్ కమిషనర్ కార్యాలయం వద్దకు చేరుకుని, డిసిపి భారీపై చర్యలు తీసుకోవాలని ప్రెస్ క్లబ్ బాధ్యులు, వివిధ సంఘాల యూనియన్ నాయకులు ,పలు జర్నలిస్టులు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ కి మెమోరాండం అందజేశారు. ఈ విషయంపై స్పందించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా యూనియన్ నాయకులు పలు జర్నలిస్టు బృందాలతో కలిసి చర్చలు జరపగా సరిగా







స్పందించకపోవడంతో.. జర్నలిస్టు నాయకులు సంతృప్తి చెందక సెంట్రల్ జోన్ డిసిపి భారీపై ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్లో డిసిపి భారీపై విడివిడిగా ముగ్గురు జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయు) అధ్యక్ష కార్యదర్శులు రామ్ రామచందర్,మట్టా దుర్గా ప్రసాద్,యూనియన్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు మిద్దెల రంగనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాడి పెల్లి మధు, ఐజేయు హన్మకొండ జిల్లా ప్రధనకార్యదర్శి తోట సుధాకర్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రెసిడెంట్ ఆడేపు సాగర్ టీయూడబ్ల్యూజే (143) రాష్ట్ర ఉపాధ్యక్షులు బిఆర్ లెనిన్,జిల్లా అధ్యక్షుడు కక్కర్ల అనిల్,మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పిన్నా శివకుమార్, గడ్డం కేశవమూర్తి,తుమ్మ శ్రీధర్ రెడ్డి ,ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, కోశాదికారి బోళ్ళ అమర్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కృష్ణ మోహన్, పెద్దిష్ , ప్రెస్ క్లబ్ కమిటీ బాధ్యులు బొడిగే శ్రీనివాస్,గొకారపు శ్యామ్, అల్లం రాజేష్ వర్మ,వలిషెట్టి సుధాకర్, పెద్దపల్లి వరప్రసాద్, ఎండీ.నయీం,వేణు గోపాల్,శ్రీకాంత్, వరంగల్ తూర్పు జర్నలిస్టుల పరపతి సంఘం అధ్యక్ష,కార్యదర్శులు కొరుకొప్పుల నరేందర్, బండి రవి, త్రినగరి జర్నలిస్ట్ సంఘాల నాయకులు,జర్నలిస్ట్‌లు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హనుమకొండ జిల్లా స్టాపర్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా ఐనవోలు మండల పరిధిలోని కక్కిరాలపల్లి గ్రామం ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లకు రూ. 5 లక్షల 50 వేల రూపాయల పనులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. గతంలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా కక్కిరాలపల్లి గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజుని ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన ఉపాధ్యాయులు, విద్యార్థి, విద్యార్థినీలు ఎమ్మెల్యే ని కలిసి మరుగుదొడ్లకు సంబంధించిన సమస్యను ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజుకి వివరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి, త్వరలోనే మరుగుదొడ్ల సమస్యను తీర్చుతానని, ప్రజా పరిపాలన కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులకుమాట ఇచ్చారు. ఇచ్చిన ప్రకారం మరుగుదొడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలోఇచ్చిన మాట ప్రకారం మేము మా ప్రభుత్వం కట్టుబడి ఉందని పాఠశాలకు సంబంధించిన పనులు ఇంకేమైనా ఉన్నా త్వరగా పరిష్కరిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్ గౌడ్. గ్రామ పార్టీ అధ్యక్షుడు పైండ్ల సంపత్ ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్‌ను అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తా...

**- మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు**

**- ఆదాయ వ్యయలపై బడ్జెట్ సమావేశం**



**సుల్తానాబాద్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** మున్సిపల్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు అన్నారు.సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బడ్జెట్ సమావేశం 2024-25 సంవత్సర ఆర్థిక ఆదాయ వ్యయలపై మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ ను రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పరిచేందుకు స్థానిక శాసనసభ్యులు శ్రీ చింతకుంట విజయ రమణారావు సహకారంతో నిధులు వెచ్చించి మానేరు వాగు నుండి శాశ్వత మంచినీటి పరిష్కారానికి పాలకవర్గ సభ్యులతో కలిసి కృషి చేస్తామని, అలాగే మున్సిపల్ లో ఉన్న ఇతర సమస్యలను ఆయా వార్డు కౌన్సిలర్ల సౌజన్యంతో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. కాలనీలలో సిసి రోడ్లు డ్రైనేజీలతో పాటు ఇతర సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం బడ్జెట్ పై సమావేశం కొనసాగించారు. 2024-25 మున్సిపాలిటీ ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ మొత్తం 960.67 లక్షలు కాగా 2024-25 సంవత్సరం సాధారణ నిధులు అంచనా ఆదాయం 291.77 లక్షలు కాగా అంచనా వ్యయం 307.59 లక్షలు 2023-24 సంవత్సరపు సవరణ అంచనా ఆదాయం 270.57 లక్షలు కాగా వ్యయం 253.95 లక్షలు గా పేర్కొన్నారు మిగులు ఆదాయం 13.35 లక్షల అని తెలిపారు. ఈ సమావేశంలో కమీషనర్ కట్ల వేణుమాధవ్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత కృష్ణ కౌన్సిలర్లు పసె డ్ల మమత సంపత్, నిషాద్ రఫీక్ ఊట్ల వర ప్రదీప్, కూకట్ల గోపి, చింతల సునీత, రాజు, గొట్టం లక్ష్మి మల్లయ్య, అనుమల అరుణ, బాబురావు, రేవెల్లి తిరుపతి, దున్నపోతుల రాజయ్య, గుర్రాల శ్రీనివాస్, కోఆప్షన్లు సయ్యద్ సాజీద్ ఫాతిమా ఖలీం మెంగాని రాధ మేనేజర్ అలీముద్దీన్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

# నూతన ఎస్ఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**చిట్యాల, మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూట్ల తిరుపతి గారి ఆధ్వర్యంలో నూతనముగా చిట్యాల పోలీస్ స్టేషన్ కు విచ్చేసిన ఎస్ఐ గారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి స్వీట్లు అందించడం జరిగింది. జిల్లా నాయకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూలశంకర్ గౌడ్, మండల ఎస్సీ సెల్ ఎస్టీ సెల్ బోట్ల రవి, నందరాజు, ఓబిసి మండల అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమరయ్య, మండల యూత్ అధ్యక్షులు అల్లకొండ కుమార్, మండల నాయకులు మాజీ సర్పంచులు, యూత్ నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# పార్థివ దేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన పార్టీ నాయకులు



**తొర్రూర్, మార్చి 11,(పిసిడబ్ల్యూ న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలంలోని చింతలపల్లి గ్రామ వాస్తవ్యులు కాంగ్రెస్ పార్టీ బూత్ కన్వీనర్ బోలగాని మహేష్ గత రాత్రి గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు వారి స్వగృహంలో కుటుంబ సభ్యులను పరా మర్శించి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు పెదగాని సోమన్న ,వీరితోపాటు తొర్రూర్ మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్ , మేకల కుమార్ కాటం మల్లారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు వడ్లకొండ కుమార్, ఎడ్ల యాకూబు రెడ్డి ,వెంకట్ రెడ్డి, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీ సురేందర్ రెడ్డినీ కలిసిన కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి



**మరిపెడ, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** మరిపెడ మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గ మరిపెడ మండలం పురుషోత్తమయి గూడెం లో గంగమ్మ తల్లి గుడి ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ సురేందర్ రెడ్డి, డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ నీ మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించిన బిఆర్ఎస్ పార్టీరాష్ట్ర నాయకులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమంలో నూకల నరేష్ రెడ్డి, అంబ్బరిష,అశోక్, నాయకులు ప్రజాప్రతినిధులున్నారు.

# మానవత్వం చాటుకున్న గుండె కారి శ్రీనివాస్ రావు



**చిట్యాల,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ జిల్లా చిట్యాల చల్లగరిగ గ్రామానికి చెందిన ఓరుగంటి నిరంజన్. ఆదివారం సాయంత్రము.అనారోగ్యంతో మరణించగా.విషయం తెలుసుకున్న వెంటనే వారి కుటుంబ సభ్యులకు 15వేల రూ.లుగుండెకారి శ్రీనివాసరావు ఆర్థిక సహా యం అందజేసి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి.వారి పవి త్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని తమ ప్రగడ సానుభూతి తెలిపారు.

## మహిళా దినోత్సవ సభను విజయవంతం చేసిన మహిళలకు ధన్యవాదాలు

**- సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ ,ఫౌండేషన్ చైర్మన్ , సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్**



**ములుగు జిల్లా,మార్చి 11 (పీసి డబ్ల్యూ న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సర్వర్ చారిటబుల్ ట్రస్ట్, ఫౌండేషన్ మరియు చైర్మన్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హాజరైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపిన సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ , ఫౌండేషన్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలోని సాధన స్కూల్ ప్రక్కన గ్రౌండ్ లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హాజరైన అతిథులకు మీడియా ప్రతినిధులకు మహిళలకు ప్రతి ఒక్కరికీ తస్లీమా ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజల దాహాన్ని తీర్చేందుకే చలివేంద్రాలు

**- అడిషనల్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్**



**సుల్తానాబాద్, మార్చి11( పిసిడబ్ల్యూ న్యూస్) :** వేసవి కాలంలో ప్రజల దాహాన్ని తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అడిషనల్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. సోమవారం సుల్తానాబాద్ తాసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ చేతుల మీదుగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రానున్న కాలంలోఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి తాసిల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు దాహం తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, ఆర్ ఐ లు శ్రీవాణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఐపీఎస్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**సుల్తానాబాద్, మార్చి 11. (పిసిడబ్ల్యూ న్యూస్):** సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు.ఈ నెల 10వ తేదీ ఆదివారం వరంగల్ జిల్లాలో జరిగిన 8వజాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో జి హర్షవర్ధన్ కరాటే,స్పారింగ్ విభాగంలో బంగారు పథకం సాధించగా ఏ అరుణ్,జి రిషి వర్ధన్ కరాటే విభాగంలో బంగారు పతకాలు సాధించారు.ఐపీఎస్ పాఠశాల డైరెక్టర్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ వలన మంచి క్రమశిక్షణ ఏర్పడుతుందని తమ స్వీయ రక్షణకు,ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ అవసరమన్నారు.




# డబుల్ బెడ్రూం బొమ్మకే పరిమితం : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం, మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) భద్రాచలం/మణుగూరు :** గత పదేళ్లలో ఎన్ని ఇళ్లు ఇచ్చారని, డబుల్ బెడ్రూం బొమ్మకే పరిమితమైందని మాజీ సీఎం కేసీఆర్ ను ఉద్దేశించి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరుతుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటన సందర్భంగా భద్రాచలం, మణుగూరు ప్రాంతాల్లో జరిగిన సభల్లో పొంగులేటి మాట్లాడారు. రాష్ట్రాన్ని రూ.7లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన గత ప్రభుత్వం భద్రాద్రి రాముడికి రూ.100కోట్లు కూడా ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదో గ్యారంటీగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేస్తామని తెలిపారు. దళిత, గిరిజనులకు రూ. 6లక్షల చొప్పున, మిగిలిన వారికి రూ. 5 లక్షల చొప్పున ఇంటి నిర్మాణానికి ఇస్తామన్నారు.




గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2.90 లక్షల డబుల్ బెడ్రూం ఇళ్ల టెండర్లు పిలిచి 1.49 లక్షలు మాత్రమే నిర్మించి.. కేవలం 90వేలు మాత్రమే లబ్ధిదారులకు పంపిణీ చేసిందన్నారు. గత ప్రభుత్వంలాగా పింక్ కండువాలకే కాకుండా... గ్రామసభలు నిర్వహించి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వర్తింపజేస్తామని అన్నారు. ఈ సభల్లో మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు ప్రసంగించారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రోహిత్ చౌదరి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, మట్టా రాగమయి, రాంచందర్ నాయక్, తెల్లం వెంకట్రావ్, కూనంనేని సాంబశివరావు, రాందాస్ నాయక్, డీసీసీ అధ్యక్షులు పోదెం వీరయ్య, పువాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, మద్దినేని బేబీ స్వర్ణ కుమారి, బొర్రా రాజశేఖర్ , మువ్వా విజయ బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిసి మహా పాదయాత్రకు మోత్కూరు నాయకులు ఘన స్వాగతం

**మోత్కూరు,మార్చి 11 (పీసి డబ్ల్యూ న్యూస్):** ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, హిందూ బి.సి మహాసభ వ్యవస్థాపక అద్యక్షులు బత్తుల సిద్దేశ్వర్లు, తెలంగాణ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ల నాయకత్వంలో చట్టసభల్లో బి.సి వాటా సాధన కోసం కొనసాగుతున్న బిసి మహా పాదయాత్రకు 11వ రోజు 210 కిలోమీటర్లు పూర్తి చేసుకొని మోత్కూరు మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రానికి చేరుకున్న పాదయాత్ర బృందం ప్రధాన రహదారిలో గల కొండా లక్ష్మన్ బాపూజీ, దొడ్డి కొమురయ్య, సర్దార్ సర్వాయి పాపన్నల విగ్రహాలకు పూలమాలలు వేసి వారి స్పూర్తితో చట్టసభల్లో బి.సి ల వాటా సాధిస్తామని నినదించారు. మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్దకు చేరుకున్న పాదయాత్ర బృందానికి స్థానిక ప్రజాసంఘాల నాయకులు బి.సి సంక్షేమ సంఘం నాయకులు అవిశెట్టి అవిలిమల్లు, జి.రామచంద్ర గౌడ్, పోచం సోమయ్య, పోచం యాదగిరి, ఘనగానీ నరసింహ, మురిగాల వెంకన్న, ఎడ్ల శ్రీనివాస్, ఉయ్యాల అంజయ్య, లక్ష్మీనారాయణ తదితరులు ఘన స్వాగతం పలికి శాలువాలతో పాదయాత్ర నాయకులను సన్మానించి, జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ కోసం పాదయాత్ర చేస్తున్న ఆల్ ఇండియా ఒబిసి నాయకత్వానికి, వారి బృందానికి స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు. స్వార్థ రాజకీయాలు ఎక్కువైన నేటి రోజుల్లో 60 శాతం ప్రజల అభివృద్ధి కోసం పాదయాత్ర చేయడం గొప్ప విషయమని అన్నారు. చట్టసభల్లో బి



సి వాటా కోసం చేస్తున్న పోరాటానికి మోత్కూరు ప్రజలుగా అండగా ఉంటామని, గ్రామగ్రామాన పాదయాత్ర బృందానికి మద్దతుగా నడిచి యాత్రను జయప్రదం చేసి చట్టసభల్లో వాటా సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జాక్ నాయకులు సాయిని నరేందర్, మేకపోతుల నరేందర్ గౌడ్, బత్తుల సిద్దేశ్వర్లు, పటేల్ వనజ లు తరతరాలుగా దోపిడీకి గురవుతున్న ఉత్పత్తి కులాలైన బి.సి లకు ఆయా కాలాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే, సాహు మహారాజ్ లాంటి వాళ్ళు ఎన్నో హక్కులు తెచ్చిపెట్టారని వారి స్పూర్తితో నేటి కాలంలో చట్టసభల్లో బి.సి లకు వాటా సాధనతోనే సకల సామాజిక రంగాల్లో బి.సి లకు సమాన వాటా సాధిస్తామని అన్నారు. చట్టసభల్లో బి.సి వాటా సాధన కోసం జరుగుతున్న పాదయాత్ర పోరాటానికి పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు, ఎం.పి, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు మద్దతు పలికి వెంట నడవాలని అలా కలిసిరాని వారిని బి.సి వ్యతిరేకులుగా భావించాల్సి వస్తుందని అన్నారు. వృత్తి



విప్లవకారుల కేంద్రమైన తెలంగాణలో ప్రారంభమైన ఈ పాదయాత్ర మహబూబ్ నగర్ జిల్లా పండుగ సాయన్న వద్ద మొదలై హైదరాబాద్ కొండా లక్ష్మన్ బాపూజీ, ఉమ్మడి నల్గొండ జిల్లా బెల్లి లలితక్క, శ్రీకాంత చారి, మారోజు వీరన్న, ఉమ్మడి వరంగల్ జిల్లా దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్న వరకు కొనసాగుతుందని, పార్లమెంటు ఎన్నికల తర్వాత ప్రారంభమయ్యే రెండవ విడత యాత్ర ఢిల్లీ వరకు కొనసాగుతుందని వారన్నారు.ఈ పాదయాత్రలో ఆల్ ఇండియా ఒబిసి జాక్ వైస్ చైర్మన్ వెలుగు వనిత నాయకులు సింగారపు అరుణ, బుచ్చిబాబు, గడిపిపె విమల, బాలస్వామి, ఎర్రమల్ల శ్రీను, బుచ్చిబాబు, చెన్న శ్రావణ్ కుమార్, ఎర్ర శ్రీహరి గౌడ్, గిరగాని బిక్షపతి గౌడ్, అజయ్ పటేల్, చాపర్తి కుమార్ గాడ్గే, అనంతుల రాంప్రసాద్, కొంగర నరహరి, విశ్వపతి, బత్తుల రాంనర్సయ్య, పర్వత సతీష్, కుంట విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎంపీ టికెట్ కేటాయించాలి

**- వరంగల్ ఎంపీ ఆస్పిరెంట్ శివరాశి ప్రసాదరాజు**


**హనుమకొండ, మార్చి11(పిసిడబ్ల్యూ న్యూస్):** అన్ని అర్హతలు, రాజకీయ అనుభవం ఉన్న తనకే వరంగల్ పార్లమెంటు టిక్కెట్ ఇవ్వాలని వరంగల్ మున్సిపల్ మాజీ చైర్మన్ శివరాశి ప్రసాదరాజు అన్నారు. సోమవారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసాదరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా 1965 నుండి 1969 వరకు వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా,1987 నుండి 1999వరకు వరంగల్ మున్సిపల్ చైర్మన్ గా, అదే కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వైస్ చైర్మన్ గా, 1989 నుండి1991, 1996 వరకు జరిగిన అసెంబ్లీ,లోక్ సభ అభ్యర్థుల విజయానికి ఎనలేని కృషి




చేశానన్నారు. 1987నుండి 1992 వరకు వరంగల్ నగర ప్రజలకు మంచినీటి సరఫరా దోమల నిర్మూలన, వీధిలైట్లు, రోడ్లు, పార్కుల అభివృద్ధి తదితర అభివృద్ధి పనులు చేసి నగర ప్రజల మన్నలను పొందడంతో పాటు కూరగాయల వ్యాపారులకు రుణాలు మంజూరు చేయించి రిక్షా పుల్లర్లకు, హమాలీలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేశానని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నియోజకవర్గ అభివృద్ధి కర్తవ్యం గా భావించే తనకు పార్టీ టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. విద్యావంతుడైన తనకు సీటు కేటాయించడం ద్వారా వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం కి కేంద్రం నుండి రావాల్సిన నిధులపై పోరాడి సాధించుతానని అన్నారు. ఏఐసీసీ టీపీసీసీ బాధ్యులు తను గతంలో చేసిన సేవలను గుర్తించి తనకు సీటు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాజేందర్, మాజీ మార్కెట్ డైరెక్టర్ కె పూర్ణచందర్, పి యాదగిరి, కొట్టె భాస్కర్, స్వామి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాంతచారి స్పూర్తితో చట్టసభల్లో బిసి వాటా సాధిస్తాం

**- చట్టసభల్లో బి.సి వాటా పోరాటానికి శ్రీకాంతచారి తల్లితండ్రుల మద్దతు**



**మహబూబ్ నగర్ జిల్లా,మార్చి11(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరడు శ్రీకాంతచారి స్పూర్తితో చట్టసభల్లో బిసి ల వాటా సాధిద్దామని ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, వైస్ చైర్మన్లు పటేల్ వనజ, వెలుగు వనిత, తెలంగాణ బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్, హిందూ బి.సి మహాసభ రాష్ట్ర



అధ్యక్షులు బత్తుల సిద్ధేశ్వర్లు అన్నారు. చట్టసభల్లో బి.సి వాటా సాధన కోసం ఈ నెల ఒకటిన మహబూబ్ నగర్ జిల్లాలో ప్రారంభమైన బి.సి మహా పాదయాత్ర 11వ రోజు 220 కిలోమీటర్లు పూర్తి చేసుకొని సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అమరుడు శ్రీకాంతాచారి స్వగ్రామం పొడిచేడు చేరుకొని ఆయన తల్లితండ్రులు వెంకటాచారి, శంకరమ్మ ల దీవెనలు తీసుకొని శ్రీకాంతచారి విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. శ్రీకాంతచారి తల్లిదండ్రులు వెంకటాచారి, శంకరమ్మలు మాట్లాడుతూ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల కోసం త్యాగం చేసిన మా కుమారుడితో పాటు 1200 మంది బలిదానాలు చేసుకున్నారని, వారు కలలు కన్న తెలంగాణ చూడలేకపోయామని అన్నారు. ఎన్ని ఉద్యమాలు జరిగినా, ఏ ప్రభుత్వాలు మారినా అందులో త్యాగాలు బి.సి లవి అవుతున్న అధికారం, అభివృద్ధి మాత్రం ఆధిపత్య కులాలది అవుతుందని అన్నారు. మనది కాని పోరాటానికి మన బి.సి లు త్యాగాలు చేసారని అన్నారు. నేడు బి.సి ల అభివృద్ధి కోసం జరిగే ఈ పాదయాత్ర ఉద్యమానికి మేము ముందుంటామని, చట్టసభలలో వాటా సాధించిన నాడే సామాన్య బి.సి లు చట్టసభల్లోకి వెళ్లగలుగుతారని, అలాంటి ఉద్యమానికి అన్ని విధాలుగా సహకారంగా ఉంటూ కలిసి నడుస్తామని వారన్నారు. పాదయాత్ర బృందాన్ని వారి ఇంటికి ఆహ్వానించి శంకరమ్మ దంపతులు అందరినీ శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాదయాత్ర నాయకులు సింగారపు అరుణ, బుచ్చిబాబు, గడిపిపె విమల, బాలస్వామి, ఎర్రమల్ల శ్రీను, బుచ్చిబాబు, ఎర్ర శ్రీహరి గౌడ్, గిరగాని బిక్షపతి గౌడ్, అజయ్ పటేల్, చాపర్తి కుమార్ గాడ్గే, అనంతుల రాంప్రసాద్, కొంగర నరహరి, విశ్వపతి, కుంట విజయ్ కుమార్లు పాల్గొన్నారు.